
# ఓ మై డాగ్!



★

రచన : శ్రీ బచ్చువీర్రాజు

'శంభూ నగర్' లో ఈమధ్య చిన్న-చిన్న దొంగతనాలు హెచ్చు మీరడంతో. మా రైల్వే స్టాఫ్ అంతా తీవ్ర వేదనకు గురి కావడం జరిగింది.

మాలో మేమంతా. వంతులవారీగా, రాత్రిళ్లు నలుగు రైదుగురు కలిసి గస్తీ తిరగాలని. నిశ్చయించుకొన్నాం.

o o o

ఓ శుభ ముహుర్తాన. గస్తీ కార్యక్రమం ఎంతో హుషారుగా మొదలయింది. ఇంటికి ఒక్కొక్కరు చొప్పున ఓ నలుగురు మనుషులు గస్తీ ప్రారంభించారు.

మొదటి రోజు, నా ఫ్రెండ్ జీవరత్నం టేప్ రికార్డర్ దొంగిలించబడింది. రెండో రోజు పరిస్థితి బాగానే వుండి. మూడో రోజు నా ఫ్రెండ్ రెహమాన్ యింట్లో ట్రాన్సిస్టర్ పోతే, నాలుగో రోజు మా గార్డ్స్ క్లర్క్ మోహనరావు గారింట్లో సూట్ కేస్ పోయింది. గస్తీ తిరిగేవాళ్లు తెల్లవారు జామున తలలు వాల్చేసి గోడకి జేర్లపడి పోవడంతో గస్తీ కార్యక్రమం నీళ్ళు కారిపోవడం మొదలు పెట్టింది.

దొంగతనం చేసేది ఆ చుట్టుప్రక్కల ఉండే మనుష్లల్లో, ఎవరో ఒకరిద్దరు అయివుంటారని నిర్ధారణ చేసుకొన్నాం. మాతో చాలామంది రన్నింగ్ స్టాఫ్‌కు చెందిన వాళ్ళుండ గావడంతో. ఇంట్లో మగవాళ్లు లేకపోవడం దొంగతనం తరచు పరిపాటి. దొంగతనం కేవలం చిన్న-చిన్న వస్తువులపైనే సాగడం మమ్మల్ని ఆశ్చర్యంలో ముంచసాగింది.

ఒకరోజు డ్యూటీనుంచి ఇంటికి రాగానే, మా యింట్లో వాళ్ళు చాలా కంగారు పడటం కనిపించింది. వెంటనే శ్రీమతిని. సంగతేమిటాని నిలదీసాను. టేబిల్‌మీద పెట్టిన అలారం గడియారం గల్లంతైంది. ఆదొంగతనాల తాలూకు టర్న్ నా కొంప మీదకు కూడా వచ్చేసినందుకు, ఒక్కసారిగా తల పట్టుకొని కూర్చుండి పోయాను.

ఆ మరునాడు మా బాబు ఎక్కడనుంచి పట్టుకొచ్చాడో గాని, ఓ బొచ్చుకుక్క పిల్లను మాయింట్లోకి తీసుకొచ్చాడు. అది చూడటానికి తెల్లగా, బొజ్జుగా బాగుంది.

శ్రీమతికి యిష్టం లేకపోయినా, మా పిల్లల్తో బాటు, నేను కుమ్మక్కై దానిని పెంచి, దొంగను పట్టాలని నిర్ణయించుకొన్నాను.

వెంటనే నెలసరి బడ్జెట్‌లో దానికి వంద రూపాయలు కేటాయించడం జరిగింది.

ఓ నాలుగురోజులు కోలనీ అంతా ప్రశాంతంగా వుండి. సరిగ్గా అయిదోరోజున తిరిగి మా యింట్లోనే స్టీలుబిందె మాయమై పోయింది. నాకు మతి పోయింది.

ఓసారి బొచ్చుకుక్కపిల్ల 'జిమ్మీ' వంక కోపంగా చూసాను.

మా బాబు నన్ను గమనించి 'నాన్నా! అది యింకా చిన్నపిల్ల గదా! ఇంకా కొన్నిరోజులు పోతేగాని దొంగల్ని పట్టుకోలేదు' అన్నాడు సంజాయిషీగా.

శ్రీమతి మూతి తిప్పుకొంది. నేను వాడి మాటల్లోని నిజం గుర్తించి, శాంతించాను.

పిల్లలంతా ఆ కుక్కపిల్లను 'జిమ్మీ' అని పేరుపెట్టడం రోజూ ఓ అర లీటర్ పాలూ, పెరుగన్నం, బిస్కట్లూ దానిని బుజ్జగించి, ఆరగించేలా చెయ్యడం శ్రీమతికి ఒళ్ళు మండిపోతూ వుండేది. నేను తటస్థంగా వూరుకొన్నాను,

ఇలా మా యింట్లో స్టీలుబిందె పోయిందని తెలియగానే మిత్రులంతా, ఇదివరలో గడియారం పోయినప్పుడులాగే, తిరిగి పరామర్శ చెయ్యడం మొదలుపెట్టారు.

లెక్కలు వేస్తే, రెండుసార్లు దొంగతనం జరిగింది. నా యింట్లోనే కాబట్టి నా మీద అందరికీ సానుభూతి పెరిగి పోయింది.

ఆ రోజు యింట్లోనే వున్నాను. సరిగ్గా అర్ధ రాత్రివేళ జిమ్మీ అరుపులు వినిపిస్తే, కర్రా, టార్చిలైటూ తీసుకొని వరండాలోకి వచ్చాను. నేను బయటకు వచ్చేసరికి, అది ఓ మనిషిని తరుముకొంటూ రోడ్ ఎక్కేసింది.

వెంటనే దాని అరుపులకి నలుగురూ ప్రోగయ్యారు. ఆ మనిషి వెనకాల కుక్కపిల్లా, దానివెనుక నేనూ, నా వెనుక ఆ కోలనీవాసులూ రన్నింగ్ రేస్‌లో పడ్డాం. కొంతసేపటికి ఆ దొంగవెధవ ఓ పాడుబడ్డ గుహలోకి చొర పడ్డాడు. వాడిని మా జిమ్మీ మాత్రం వదిలిపెట్టలేదు. వాడిలాగును పట్టుకొని పైకి ఎగబడి పోతోంది.

ముగ్గురూ వాడి చుట్టూ చేరేసరికి, వాడు బెంబేలెత్తి పోయి, పాంట్ జేబులోని ఓ రిస్ట్‌వాచీ బయటకు విసిరేశాడు. అది మా ప్రక్కపోర్షన్‌లోని ప్రసాద్ అనే గార్డు గారిది. వెంటనే నలుగురూ కల్సి, గబ-గబా ఓ కోటింగ్ యిచ్చాం వాడికి. మా జిమ్మీ మాత్రం వాడి పాంట్ రెండో జేబువైపుకు చూస్తూ ఎగబడ్తూ, మొరుగుతూనే వుంది.

వెంటనే 'ఆ జేబులో వున్నదికూడా బయట పెట్టరా ఫూల్!' అంటూ మా ఫ్రెండ్ రత్నం అరిచాడు.

దానికి ఆ దొంగ ఏడుపుముఖం పెట్టి, పాంటుజేబులో చెయ్యిపెట్టి బయటకు లాగాడు. అది కుక్క బిస్కట్ల ప్యాకెట్. ఒక్కసారిగా నేను దిగాలు పడిపోయాను.

ఇంతలో దొంగమనిషి 'అయ్యా! వాచీ దొంగలించి వచ్చాక, ఆకలేస్తుంటే వరండాలోని కిటికీలో యీ బిస్కట్‌ప్యాకెట్ కనబడితే జేబులో కుక్కుకున్నాను. దానితో యీ కుక్కపిల్ల నా మీద తిరగబడింది' అంటూ తల వంచుకొన్నాడు దిగాలుగా.


'కథాంజలి' దీపావళి సంచికకు మా శుభాకాంక్షలు !

నోవెల్ వజ్రములు

నగలను అలంకరించుటకు

విశిష్టతకు ప్రసిద్ధి చెందినది.

అన్ని విధములైన కలర్ కమలములూ

మా వద్ద దొరుకును.

మా వజ్రములకు గ్యారంటీ ఇవ్వబడును,

—: వివరములకు :—

Phone No. 27468

NOVEL DIAMOND WORKS

7-A 2, North Sowrastra St. : : TIRUCHIRAPALLI-620 008.

వాడి మాటలు విన్న రెహమాన్ వెంటనే నా భుజం తట్టి 'శెహభాష్! భలేకుక్కను పెంచుతున్నావు భాయ్!' అన్నాడు.

నేను సిగ్గు పడిపోయి తల వంచుకొన్నాను. మాదీ, గార్డ్ ప్రసాద్‌గారిదీ కామన్ వరండా గావడంతో, ఆ దొంగ, ఆయన యింట్లో వాచీ దొంగతనం చేసి పారిపోతూ, మా కుక్కపిల్ల బిస్కెట్లప్యాకెట్ గురించి కక్కుర్తి పడటంతో, యీ తతంగమంతా జరిగినట్లు అందరికీ తెల్సిపోయింది.

ఇంతలో ఎవరో వాడి బొడ్లో దాపుకున్న పరికరాల్ని బయటకు తీసారు. అవన్నీ తలుపు గడియలు తెరిచే సాధనాలుగా వున్నాయి. అంతా ఆశ్చర్యపోయారు.

కొంత సేపటికి నలువైపులా చూస్తూ, మా రత్నం వాడి పొట్టమీద ఓ 'బ్లో' యిచ్చి, 'ఇంతకుముందు దొంగిలించిన వస్తువుల మాటేమిటి? వాటి సంగతి చెప్పరా బడుద్ధాయ్!' అంటూ మరో 'బ్లో' యిచ్చాడు.

దానికి వాడు 'అమ్మా!' అంటూ కూలబడి పోయాడు. ఇంతలో ఎవరో 'ఒరేయ్! ఈ గుహలోకి ఎవ్వరూ రారని వీడు దీంట్లోనే స్థావరం ఏర్పరుచుకొని వుంటాడు. ఓ సారి లోపల వెదకండిరా!' అని అరిచారు.

వెంటనే నలుగురూ నాలుగు ప్రక్కలకూ వెళ్ళి ఓ బండరాయి వెనుకవున్న ఓ పెద్దమూటను తీసుకొచ్చారు.

అది విప్పితే...అందులో ట్రాన్సిస్టర్, టేప్‌రికార్డర్, అలారం గడియారం, బిందె, సూట్‌కేస్ దర్శనమిచ్చాయి. ఒక్కసారిగా అందరి కళ్ళూ విప్పారాయి. ఆ వస్తువులన్నీ మా కోలనీలో పోయినవే.

ఆ దొంగని యిద్దరు యువకులు పోలీస్‌స్టేషన్‌ని తీసుకెళ్తుంటే, మేము కోలనీవైపు నడిచాం ఆ సామాన్లమూటను తీసుకొని.

మా ఫ్రెండ్ రెహమాన్ జిమ్మీని ముద్దు పెట్టుకుంటూ, 'రాజాభాయ్! తన బిస్కట్లప్యాకెట్ గురించి దొంగ వెనక పడ్డా, మొత్తానికి మన వస్తువులు మనకి దక్కించింది. మీ కుక్కపిల్లకి హేట్సాఫ్' అంటూ నవ్వాడు.

నాకు నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు.

# శ్రీ శ్రీ సూక్తి బాట

1. ప్రపంచ మొక పద్మవ్యూహం. కవిత్వ మొక తీరని దాహం.

2. అనర్గళం అనితరసాధ్యం నా మార్గం.

3. అలజడి మా జీవితం. ఆందోళన మా ఊపిరి, తిరుగుబాటు మా వేదాంతం.

4. ముందుకు పోతాం మేము. ప్రపంచం మా వెంట వస్తుంది.

5. తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?

6. ఆశయం సాధించాలంటే ఆయుధం అవసరమే మరి!

7. ఎవరో తోడు వస్తారని, ఏదో మేలు చేస్తారని ఎదురుచూసి మోస పోకుమా.

8. తెలుగుదేశం తూర్పు సముద్రం ముక్క. కేవలం నా కన్నీటి చుక్క.

9. కవి కూడా అన్యాయం పైనా, అమాయకత్వం పైనా, అసమానత పైనా పోరాడే వాడే.

10. కష్టజీవికి రెండువైపులా నిలిచేవాడే కవి.

11. అహింస ఒక ఆశయమేకానీ, ఆయుధం ఎప్పుడూ కాదు.

12. మరణానంతర జీవితంలో నాకు నమ్మకం లేదు. ఒక వ్యక్తి జీవితం చాలు. దానిని సార్థకం చేసుకుంటే అది గొప్ప సంగతి. ఆచరణకి దారి తీస్తేనే ఆవేశం సార్థకమౌతుంది.

13. మాకు గోడలు లేవు. గోడలను పగులగొట్టడమే మా పని.

14. భవిష్యత్తు కష్టజీవులది. ఈ భువి వారసులూ. అధినేతలూ వారే. వాళ్ళే రేపటి శాస్త్రవేత్తలూ, కవులుగా అవతరిస్తారు.

15. ఆయుధశక్తి కన్న మానవశక్తి మిన్న.

—రాధేయ.